క్లుప్తంగా

నేడు శింగరకొండలో హనిమిరెడ్డి పూజలు

అద్దంకి రూరల్: నేడు శింగరకొండలో నియోజకవర్గ ఇన్‌చార్జి హనిమిరెడ్డి పూజలు చేయనున్నారు. టీటీడీ పవిత్రతను దిగజార్చుతూ, స్వామివారి లడ్డూ ప్రసాదం విశిష్టతను రాజకీయ దుర్బుద్ధితో అసత్య ప్రచారంతో సీఎం చంద్రబాబు అపవిత్రం చేసినందుకు, పాపాన్ని ప్రక్షాలన చేసేందుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు హనిమిరెడ్డి శనివారం ఉదయం 11 గంటలకు శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

శింగరకొండ దేవస్థాన ఏసీగా తిమ్మనాయుడు



అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన సహాయ కమిషనర్ తల్లాప్రగడ సుభద్ర సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు పట్టణం లాలాపేట గ్రూప్ దేవస్థానాల ఈవోగా బదిలీపై వెళ్తున్న సందర్భంగా అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం, పాలకమండలి పూర్వ సభ్యులు ఘనంగా సన్మానించి ప్రశంస పత్రాన్ని, సమర్పించారు. నూతన ఈవోగా బాధ్యతలు చేపట్టిన తిమ్మనాయుడుని కూడా సత్కరించారు. కార్యక్రమంలో అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు జమ్మలమడక హనుమంతరావు ధర్మవరపు అప్పారావు, వెంపరాల సత్యనారాయణ ఎం రాధాకష్ణమూర్తి, సర్పంచ్ ఎర్రిబోయిన తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ



వేటపాలెం: వేటపాలెం ఎంపీడీఓగా ఎం రాజేష్‌బాబు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన నెల్లూరు జిల్లా వింజమూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన రూతమ్మ కొంత కాలం కిందట ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఎంపీడీఓ పోస్టు ఖాళీగా ఉండగా, సూపరింటెండెంట్ ఎంపీడీఓ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓను కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీడీవోగా జోతిర్మయ్



సంతమాగులూరు (అద్దంకి): సంతమాగులూరు ఎంపీడీవోగా జీపీకేఎస్‌వీ జోతిర్మయ్ నియమితులయ్యారు. ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా ఈయన గణపవరం మండల పరిషత్ అధికారిగా పనిచేస్తూ బదిలీపై సంతమాగులూరు ఎంపీడీవోగా నియమితులై శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

బల్లికురవ ఏపీఎంగా రాజారావు

బల్లికురవ: బల్లికురవ మండల వెలుగు ఏపీఎంగా తూమాటి రాజారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఎం బాచిన సురేంద్రబాబు సాధారణ బదిలీల్లో భాగంగా మార్టూరు వెలుగు కార్యాలయానికి బదిలీ అయ్యారు. బాపట్ల జిల్లా డీఆర్‌డీఏ పెన్షన్, బీమా విభాగాల్లో పనిచేస్తున్న రాజారావు బదిలీపై ఇక్కడకు వచ్చి విధుల్లో చేరారు.

53వ గంధం ఉరుసు మహోత్సవాలు

చీరాల అర్బన్: పట్టణంలోని వైకుంఠపురంలో శనివారం నుంచి మంగళవారం వరకు హజరత్ సయ్యదీనా సయ్యద్ కరీముల్లాషా ఖాదరి వురఫ్ కాలేషావీర్ మస్తాన్‌వలి రహమతుల్లా అలైహి 53వ గంధం ఉరుసు మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజులు పాటు దర్గాలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయన్నారు. భక్తులందరూ కార్యక్రమాల్లో పాల్గొని మహనీయుల ఆశీర్వాదాలు పొందాలన్నారు.

వ్యాసరచన విజేతలకు బహుమతులు

అద్దంకి: జిల్లా విద్యాశాఖ అధికారి, బాపట్ల వారి ఆదేశాల మేరకు వికసిత్ భారత్‌లో భాగంగా ఈరోజు మండల స్థాయిలో నిర్వహించబడిన స్వర్ణాంధ్ర-2047 అనే అంశంలో 'స్వర్ణాంధ్ర సాధించుటకు రాబోవు ఐదేళ్లలో విద్యారంగంలో తీసుకురావాల్సిన సంస్కరణలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో గొరకాయపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఎర్రమోతు లక్ష్మి ప్రథమ స్థానంలో నిలిచింది. వక్తృత్వంలో ప్రథమ విజేతగా అద్దంకి అమృత జెడ్పీహెచ్ఎస్ చక్రాయపాలెం, చర్చలో ప్రథమ విజేతలుగా సీహెచ్ నవ్యశ్రీ, పీ చైతన్య, వరలక్ష్మి అంబేద్కర్ గురుకులం, శింగరకొండ, అద్దంకి విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వారికి ఎంఈవోలు గంగాధర్, సుధాకర్‌లు అభినందనలు తెలియజేశారు. మండల స్థాయిలో విజేతలైన విద్యార్థులు నేడు జిల్లాస్థాయిలో బాపట్లలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నారని చెప్పారు.

చిరుతిళ్లు కావవి.. రోగాల బాంబులు

- దుకాణాల్లో నాణ్యత లేని చిరుతిండ్లు
- ప్యాకెట్ తినుబండారాలతో పొంచిఉన్న ముప్పు
- చిన్నారుల పాలిట శాపాలుగా మారుతున్న వైనం
- కనీసం తనిఖీలు నిర్వహించని అధికారులు



దుకాణంలో విక్రయానికి ఉంచిన ప్యాకెట్లు

మేదరమెట్ల: చిన్నపిల్లలు చిల్లరకొట్టు కనబడితే చాలు.. చాక్లెట్, బిస్కట్ అడుగుతుంటారు. మనం కూడా చిన్నపిల్లలు కదా అని కొని ఇస్తుంటాం. కాని ఇదే ఇప్పుడు చిన్నారుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. నిత్యం మనం తింటున్న ఆహార పదార్థాలతో పాటు గాలి, నీరుతో పాటు అన్నీ కల్తీమయం అవుతున్నాయి. కొందరు అక్రమార్కులు అడ్డదారులు తొక్కుతూ ప్రతిదీ కల్తీ చేసి అక్రమార్జనతో సొమ్ము చేసుకునేందుకుగాను సిద్ధం అవుతున్నారు. నిత్యం వినియోగించుకునే పదార్థాలతో పాటు చిన్న పిల్లలు తినే పదార్థాలను సహితం కల్తీ చేస్తున్నారు. రంగురంగు ప్యాకెట్లు ఆకర్షణీయంగా తయారు చేసి అమ్ముతున్నారు. పైన ఎంతో ఆకర్షణీయంగా కనిపించే ప్యాకెట్లలో కల్తీ అయిన ఆహార పదార్థాలు చిన్నారులు తినడం వలన పిల్లలు అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుంది. నిజమైన కంపెనీల ప్యాకెట్లను తలదన్నే విధంగా డూప్లికేట్ ప్యాకెట్లు ఎంతో ఆకర్షణతో దర్శనమిస్తున్నాయి. మండలంలోని ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో దుకాణాలు ఉండటం వ్యాపారులు పిల్లలను ఆకట్టుకునే విధంగా కార్టూన్ బొమ్మలను ప్రచురించి ఆకర్షణ రంగులతో తయారు చేస్తున్నారు. దుకాణాల ముందు దండలుగా అలాంటి ప్యాకెట్లను వేలాడదీయం అవి చూసిన చిన్నారులు ఆప్యాకెట్లు కొనుగోలు చేసి అందులోని నాసిరకం పదార్థాలను తింటున్నారు. కల్తీ చేసిన ఆహార పదార్థాలను తినవద్దని వైద్యులు, పెద్దవాళ్లు చెప్తున్నా తెలిసీతెలియని వయస్సులో ఉన్న చిన్నారులు మాత్రం వాటిని తినడం మానడం లేదు.

వ్యాపారమే లక్ష్యంగా కల్తీ ..

కేవలం వ్యాపారమే లక్ష్యంగా చేసుకొని అక్రమార్కులు చిరుతిండ్లను విచ్చలవిడిగా మార్కెట్‌లోకి తీసుకువస్తున్నారు. స్నాక్స్ ప్యాకెట్లుగా వాటిని చెలామణి చేస్తూ విక్రయిస్తున్నారు. కనీసం ప్యాకెట్లపై తయారు చేసే చిరునామా గానీ, ఎంఎఫ్‌డీ కానీ కనిపించవు. కనిపించినా అర్థం కాని రీతిలో ప్రచురించి ఉంటాయి. కొన్ని ప్యాకెట్లపైన అయితే ప్రముఖ కంపెనీల పేర్లను పోలి ఉండే పేర్లతో ప్రచురించి ఉంటాయి. ఇలాంటి నకిలీ ప్యాకెట్లు విచ్చలవిడిగా అమ్ముతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఎక్కడా ఎలాంటి దాడులు చేసినట్లుగాని అలాంటి వారిపై చర్యలు చేపట్టినట్లు గానీ లేదని చిన్నారుల తల్లిదండ్రులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

నాసిరకం ఆహారంతో అనారోగ్యం..

నాసిరకం, నాణ్యత లేని ఆహారం తినడం వలన ఆనారోగ్యానికి గురికావాల్సి వస్తుంది. ఎక్కువ రోజులు నిల్వ ఉండేదుకుగాను ఆహార పదార్థాలపై పలు రకాల రసాయనాలు కలపడం, ఆకర్షణీయంగా కనిపించేందుకు హానికరమైన రంగులను వినియోగించడం చేస్తుంటారు. అలాంటి పదార్థాలను తినడం వలన భవిష్యత్‌లో అనారోగ్యం పాలు కాక తప్పదు. చిన్నపిల్లలు అలాంటి కల్తీ ఆహారం తినకుండా వాటికి దూరంగా ఉండేలా తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– డాక్టర్ చిట్టిబాబు, వైద్యాధికారి మేదరమెట్ల

కుక్కలు బాబోయ్.. పరిగెత్తండోయ్ !



ఈపురుపాలెం మార్కెట్ సెంటర్‌లో సంచరిస్తున్న శునకాలు

చీరాల టౌన్: మండలంలోని రూరల్ గ్రామ పంచాయతల్లో శునకాలు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రధాన వీధులతో పాటు అంతర్గత రహదారుల్లో సంచరిస్తున్నాయి. ప్రధానంగా ఈపూరుపాలెం గ్రామంలోని పద్మనాభునిపేట, నలభై ఇండ్ల కాలనీ, పురుగులపేట, గాంధీపార్కు సెంటర్, ఆదినారాయణపురం, పాత మునుసుబుగారి వీధి తదితర ప్రాంతాలతో పాటు తోటవారిపాలెంలోని వీవర్స్ కాలనీ, పాత ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లో శునకాలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను కరుస్తున్నాయి. ఈపురుపాలెం నుంచి చీరాల వైపువెళ్లే ప్రధాన రహదారిపై వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ ప్రకారం షాపులు కేటాయించాలి

చీరాల: ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ ప్రకారం మద్యం షాపులు కేటాయించాలని ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మోహన్ కుమార్ ధర్మా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన మద్యం పాలసీలో మద్యం షాపుల నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ ప్రకారం షాపులు కేటాయించాలన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు షాపులు కేటాయింపులు జరగలేదన్నారు. దీనిపై రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖలు రాశామన్నారు.

పోషకాహారం తప్పకుండా తీసుకోవాలి



పోషకాహారంతో లాభాలు వివరిస్తున్న సీడీపీవో

అద్దంకి రూరల్: బాలింతలకు, గర్భిణులు, చిన్నారులు పోషకాహారం తప్పకుండా తీసుకోవాలని సీడీపీవో క్రిష్ణకుమారి తెలిపారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కలవకూరు సెక్టార్ పరిధిలోని వైదన గ్రామంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, బాలామృతం, పాలు వంటి వాటిలో ఉండే పోషక విలువల గురించి సీడీపీవో వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో గంగాధరరావు, సూపర్‌వైజర్ ఇందిరమ్మ, కార్యకర్తలు, ఆశలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తపాలాశాఖ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



తనిఖీ చేస్తున్న సీనియర్ సూపరింటెండెంట్ జాఫర్ సాధిక్

చీరాల అర్బన్: తపాల శాఖ అందించే పలు రకాల పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని సీనియర్ సూపరింటెండెంట్ పోస్టల్స్, ఒంగోలు ఎండీ జాఫర్ సాధిక్ అన్నారు. శుక్రవారం స్థానిక పేరాలలోని పోస్టాఫీసును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పోస్టాఫీసులో సిబ్బంది పనితీరును, రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖ అందించే పలు రకాల పొదుపు పథకాలు, సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్లు, సేవింగ్ ఖాతాలపై ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. అలానే ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు వంటి సేవలను పోస్టాఫీసులలో కల్పించామన్నారు. ప్రజలు కూడా ఆ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తపాలా శాఖ అందించే పథకాలపై సిబ్బంది దృష్టిసారించి సత్ఫలితాలను తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పేరాల పోస్ట్‌మాస్టర్ వినోద్, సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన ఉద్యోగులు



మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన ఉద్యోగులు

చీరాల: చీరాల మున్సిపల్ కార్యాలయంలో కొత్తగా వివిధ హోదాలలో వచ్చిన ఉద్యోగులు శుక్రవారం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిశారు. బదిలీల్లో భాగంగా చీరాల మున్సిపల్ కార్యాలయానికి వివిధ ప్రాంతాల్లో పనిచేసిన ఉద్యోగులు చీరాల మున్సిపాలిటీకి వచ్చారు. వీరందరూ మున్సిపల్ చైర్మన్‌ను కలిశారు. అంకితభావంతో పనిచేసి ప్రజల మన్నలను పొందాలని ఆయన అధికారులకు సూచించారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పూజలు

చీరాల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 9.30 గంటలకు స్థానిక 20వ వార్డులోని లక్ష్మి థియేటర్ రోడ్డులోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయ ప్రతినిధి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఆలయాలల్లో జరిగే పూజా కార్యక్రమాలలో పార్టీలోని వివిధ హోదాలలో ఉన్న నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలన్నారు.

పోటీల్లో చెరుకూరు విద్యార్థుల విజయ దుందుభి



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

పర్చూరు(చినగంజాం): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో టోర్నమెంట్, సెలక్షన్స్ మండల స్థాయిలో స్థానిక ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ఆవరణలో ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా చెరుకూరు విద్యార్థులు అండర్-14, అండర్-17 బాలురు వాలీబాల్ విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. కబడ్డీలో బాలురు అండర్-17 విభాగంలో ద్వితీయ స్థానం, ఖోఖో బాలికల అండర్-14 విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. అండర్-14, అండర్ -17 బాలబాలికల విభాగంలో మండలం నుంచి నియోజకవర్గ స్థాయికి ఎంపికైన విద్యార్థులు అనంతలక్ష్మి, ఎస్ అనూష, పీ అంజలి, సలోమి రాణి, నయోమి, రేష్మ, తిరుపతమ్మ, అండర్-17 విభాగంలో క్రిష్టినా (వాలీబాల్), సంజన (ఖోఖో), రేఖారాణి (వాలీబాల్), అండర్ 14 బాలుర విభాగంలో డీ చందు (కబడ్డీ), కే ఆకాష్, ఎన్వీ మహేష్, ఎస్కే గౌస్ ఖాజా, డీ గౌరిశంకర్ (ఖోఖో), చందు, ఆకాష్, క్రిష్టఫర్, లోకేష్, సాయితేజ, రాంచరణ్, పీ మహేష్, కే హేమంత్, పీ గౌతం, జీ గోపి, వాలీబాల్, పీ మహేష్, అహ్మద్, గోపి (కబడ్డీ), షాహుల్, ఉసమాన్, అహ్మద్ (ఖోఖో) ఎంపికయ్యారు. చెస్ అండర్-14 దూండీ, యోగ విభాగంలో ఫరహద్, రాజ్యలక్ష్మి, ఈశ్వరి, వీరంతా గంగవరంలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

అథ్లెటిక్స్‌లో విజేతలు వీరే..

నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో అండర్-14, అండర్ 17 బాలబాలికల విభాగాలలో 100 మీ.లు, 200 మీ.లు, 400 మీ.లు, 800 మీ.లు, 1500 మీ.లు, 3000 మీ.లు, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, 4/100 రిలే, షాట్‌పుట్ లలో పీ అనంతలక్ష్మి, రేష్మ, నయోమి, సలోమిరాణి, సంజన, రేఖారాణి, ఎస్ అనూష, ఎన్ మహేష్, గౌరిశంకర్, టీ గౌతం, హేమంత్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరంతా జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. వీటి వలన మానసిక, శారీకర ధృఢత్వం లభిస్తుందని చెప్పారు. అంతేకాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కనుక పతకాలు సాధిస్తే ఉద్యోగ అవకాశాలు చాలా ఉంటాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కావున విద్యార్థులు ఆటలపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల హెచ్ఎం బెంజిమన్ హనూక్, ఎంఈఓలు సత్యనారాయణ, వెంకటరామయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్ ఉదయభాస్కరరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామ పెద్దలు, పాఠశాల విద్యార్థులను అభినందించారు.

ఎస్టీఓను కలిసిన యూటీఎఫ్ నాయకులు



ఎస్టీఓను కలిసిన యూటీఎఫ్ నాయకులు

చీరాల అర్బన్: చీరాల సబ్ ట్రెజరీ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంవీ సుబ్బారావును శుక్రవారం యూటీఎఫ్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఉపాధ్యాయులకు సంబంధించిన జీతాలు, విశ్రాంత ఉపాధ్యాయులకు సంబంధించిన బిల్లులు సకాలంలో మంజూరు అయ్యేలా చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ చీరాల, చీరాల రూరల్, వేటపాలెం మండల నాయకులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన మస్తాన్‌వలి



మార్టూరు: జిల్లా వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ మార్టూరు నాయకుడు గడ్డం మస్తాన్‌వలి శుక్రవారం సాయంత్రం మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. ప్రస్తుతం నియోజకవర్గ పరిస్థితి గురించి జగన్‌కు వివరించినట్లు మస్తాన్ వలి తెలిపారు.

బత్తులను పరామర్శించిన వైఎస్సార్ సీపీ నాయకులు



బ్రహ్మానందరెడ్డిని కలిసి పరామర్శించిన పర్చూరు నాయకులు

పర్చూరు (చినగంజాం): వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మార్కెటింగ్ శాఖ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డిని పర్చూరు వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. శుక్రవారం తాడేపల్లిలోని ఆయన స్వగృహంలో కలిసి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. బ్రహ్మానందరెడ్డికి ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలిసిందే. బ్రహ్మానందరెడ్డిని పరామర్శించిన వారిలో నాయకులు కోట శ్రీనివాసరావు, గోగుల పూర్ణ, ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు



దేశాయిపేటలో సస్యరక్షణ చర్యలు వివరిస్తున్న సిబ్బంది

బల్లికురవ: వరి పంటలోసమగ్ర సస్యరక్షణ, నీటి యాజమాన్య పద్ధతులతో చీడపీడలు నివారించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారిని ఎస్పీపీ కుమారి అన్నారు. శుక్రవారం పొలంబడి కార్యక్రమంలో భాగంగా అంబడిపూడి గ్రామంలో వరి పంటలో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయంలో ఖర్చులు తగ్గించేందుకు ఆధునిక పద్ధతులను అవలంభించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వంశీ. వీపీఏ ప్రవీణ, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో వరి సాగు..

వేటపాలెం: రైతులు యాజమాన్య పద్ధతులతో వరి పైరు సాగు చేసుకోవడం ద్వారా అదిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి ఐ కాశీవిశ్వనాథ్ సూచించారు. దేశాయిపేట పంచాయతీ పరిధిలో వరి పంట సాగుపై శుక్రవారం రైతులకు పొలంబడి నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వరి నాట్లు వేసుకొనే ముందు నారు చివరలను తుంచడం వల్ల పంటకు హాని చేసే పురుగుల గుడ్లు నాశనం అవుతాయని తెలిపారు. ప్రతి రెండు మీటర్ల కి 20 సెంటీ మీటర్లు పొలంలో ఖాళీ ఉంచడం వలన పంటకు గాలి, సూర్యకాంతి సరైన విధంగా అందుతాయని తెలిపారు. దాని వలన పంట నష్టపరిచే సుడిదోమ వంటి హానికర పురుగులు ఆశించకుండా పంటను రక్షించవచ్చని తెలిపారు. అధికారుల సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పర్చూరు (చినగంజాం): ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పర్చూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎస్ మోహన్‌రావు అన్నారు. శుక్రవారం పర్చూరు మార్కెట్ యార్డులో సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల ఎరువులు, పురుగు మందులు డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలపై వారికి అవగాహన కల్పించారు. మందులను విక్రయించేటప్పుడు ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని తెలిపారు. ఎరువుల రేట్లను నోటీస్ బోర్డుపై తప్పనిసరిగా రాసి ఉంచాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై 6-ఏ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. వ్యవసాయ పరపతి సంఘాలకు ఇస్తున్న రేట్లకే మా షాపులకు కూడా ఇస్తే సరఫరా చేస్తే తాము కూడా ఎంఆర్‌పీ రేట్లకే రైతులకు విక్రయిస్తామని ఎరువుల షాపుల డీలర్లు తెలిపారు. ప్రస్తుతం డీలర్లకు వస్తున్న రేట్లు సహకార సంఘాలకు వస్తున్న రేట్ల కన్నా రూ.50 అధికంగా వస్తున్నాయని, ఈ పరిస్థితిలో ఎంఆర్‌పీ రేట్లు అమ్మడం కష్టమవుతుందని వారు అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు వేణు, ఆదినారాయణ, సుధీర్ బాబు, మేరిమ్మ, డీలర్లు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



అభిషేకాలు నిర్వహిస్తున్న మహిళలు

పర్చూరు(చినగంజాం): షిర్డి సాయిబాబా పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం పర్చూరు సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని అత్యంత శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం అక్కడికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవాలో మానవహారం



మానవహారం ఏర్పాటు చేసిన విద్యార్థులు

జే.పంగులూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజల ఆరోగ్యాలను కాపాడుకోవచ్చని మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం మానవహారాన్ని ఏర్పాటు చేశారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చందలూరు హైస్కూల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు కమ్యూనిటీకి చెందిన వ్యక్తులు చేతులు కలిపి పరిశుభ్రతపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశుభ్రతకు సంబంధించి విద్యార్థుల చేత ఉపాధ్యాయులు ప్రమాణం చేయించారు.

విద్యార్థులకు అభినందనలు



విజేతలైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

వేటపాలెం: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారని హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చీరాల నియోజకవర్గస్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను శుక్రవారం అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఇదే ఉత్సాహంతో జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ విక్టోరియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాతి ముఖమండప నిర్మాణానికి విరాళం

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖ మండప నిర్మాణానికి మాజీ దేవస్థాన ఏసీ సుభద్ర, రవికుమార్‌లు శుక్రవారం రూ. 116000 చెక్కును నూతన ఏసీ ఎం. తిమ్మనాయుడుకు అందజేశారు.



ఏసీ తిమ్మనాయుడుకు చెక్ అందజేస్తున్న మాజీ ఏసీ సుభద్ర